క్లుప్తంగా

దుర్గామాతకు బోనాలు



బోనాల ఊరేగింపులో మహిళలు

ఝరాసంగం(జహీరాబాద్): మండల పరిధిలోని కుప్పానగర్ గ్రామంలో దుర్గామాతకు భక్తి శ్రద్ధలతో బోనాలు సమర్పించారు. బుధవారం ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో బోనాల ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు బోనాలతో శివసత్తుల పూనకాల మధ్య ఆలయానికి చేరుకొని అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

నేడు మంత్రి హరీశ్‌రావు రాక

జహీరాబాద్: రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి హరీశ్‌రావు ఈ నెల 8వ తేదీన జహీరాబాద్‌లో పర్యటించనున్నట్లు బీఆర్‌ఎస్ వర్గాలు తెలిపాయి. ఉదయం 10.30 గంటలకు పట్టణంలోని ఓ ప్రైవేటు పాఠశాలను ప్రారంభించనున్నారు. 11 గంటలకు హోతి(కే) గ్రామంలో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇండ్లను పరిశీలిస్తారు. 11.30 గంటలకు ఆరెకటిక భవన నిర్మాణం పనులకు శంకుస్థాపన చేయనున్నారు. అనంతరం పద్మశాలి భవన్ నిర్మాణ పనులను పరిశీలిస్తారు. అదేవిధంగా స్థానికంగా నిర్వహించనున్న వివిధ కార్యక్రమాల్లో పాల్గొంటారు.

చదువుతోనే సమాజంలో గుర్తింపు



విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలు అందజేస్తున్న సభ్యులు

సదాశివపేట(సంగారెడ్డి): చదువుతోనే సమాజంలో మంచి గుర్తింపు ఉంటుందని లోపలికోట పద్మశాలి సమాజం అధ్యక్షుడు మునిపల్లి రామకృష్ణ అన్నారు. బుధవారం లోపలికోట హనుమాన్ మందిరంలో ఇటీవల విడుదలైన పదో తరగతి, ఇంటర్ ఫలితాల్లో ప్రతిభ కనబర్చి మార్కులు సాధించిన విద్యార్థులకు లోపలికోట పద్మశాలి సమాజం ఆధ్వర్యంలో ప్రతిభ పురస్కారాలను అందజేసి అభినందించారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో 975 మార్కులు సాధించిన పట్నం చంద్రశేఖర్, పదో తరగతిలో 9.5 జీపీఏ సాధించిన మునిపల్లి శ్రీకర్, 9.8 జీపీఏ సాధించిన నాగారం మైత్రి, ఎస్ఎస్‌సీ(సీబీఎస్ఈ) 500 మార్కుల్లో 433 సాధించిన పోల స్వాత్విక, 9.7 జీపీఏ సాధించిన గున్నల సందీప్‌ను సన్మానించి మెమొంటోలు అందజేశారు. కార్యక్రమంలో లోపలికోట పద్మశాలి సమాజం ప్రధాన కార్యదర్శి విజయ్, కోశాధికారి నాగారం గోపాల్, సభ్యులు మునిపల్లి విశ్వనాథ్, పున్న మారుతి, గణేశం, సత్యం, శ్రీనివాస్, రమేష్, మునిపల్లి మనోహర్ విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సిద్ధివినాయక ఆలయంలో భక్తుల సందడి



దైవదర్శనానికి క్యూలో నిల్చున్న భక్తులు

న్యాల్‌కల్(జహీరాబాద్): మండల పరిధిలోని రేజింతల్ గ్రామ శివారులో వెలసిన సిద్ధివినాయక ఆలయంలో భక్తుల సందడి నెలకొంది. బుధవారం సంకష్టహర చతుర్థిని పురస్కరించుకొని భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చి స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆదివారం అర్ధరాత్రి నుంచే ఆలయానికి భక్తుల రాక ప్రారంభమైంది. జిల్లాలోని నలుమూలల నుంచే కాకుండా సమీపంలోని కర్నాటక, మహారాష్ట్రాలకు చెందిన భక్తులు అధికసంఖ్యలో తరలిరావడంతో ఆలయ పరిసరాలు సందడిగా మారాయి. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఆలయ ట్రస్టు సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య



విద్యార్థులతో ఉపాధ్యాయులు

నారాయణఖేడ్: మండల పరిధిలోని కొండాపూర్ పంచాయతీ పరిధిలోని మిత్యానాయక్ తండాలో బుధవారం బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు మారుతి, ఉపాధ్యాయులు విజయ్‌కుమార్, పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ నిర్మల, ఉపాధ్యాయులు విద్యార్థులతో కలిసి తండాలో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పాఠశాలల ప్రాధాన్యత, మౌలిక వసతులు, తదితర ప్రయోజనాలను విద్యార్థుల తల్లిదండ్రులకు వివరించారు.

గ్రామాలకు పారిశ్రామిక శోభ

- కాలుష్య రహిత పరిశ్రమలతో యువతకు ఉపాధి
- రెండేళ్లలో పూర్తి చేసేందుకు సన్నాహాలు
- శరవేగంగా కొనసాగుతున్న పనులు

జిన్నారం(పటాన్‌చెరు): గ్రామాలు పరిశ్రమలకు నిలయాలుగా మారనున్నాయి. కాలుష్య రహిత పరిశ్రమల ఏర్పాటుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. ఇప్పటికే ప్రభుత్వం ఆయా గ్రామాల్లోని అసైన్డ్ భూములను సేకరించడంతో పరిశ్రమలు పనులు ప్రారంభమయ్యాయి. పరిశ్రమల ఏర్పాటు పూర్తయితే తమకు ఉపాధి లభిస్తుందని యువత ఎన్నో ఆశలతో ఎదురుచూస్తోంది. జిన్నారం మండల పరిధిలోని శివానగర్ గ్రామంలోని 114 సర్వే నంబర్‌లోని భూమిలో ఆరేండ్ల క్రితం 125 ఎకరాల అసైన్డ్ భూమిని ఎల్ఈడీ బల్బుల తయారీ పరిశ్రమల ఏర్పాటుకు కేటాయించారు. అప్పట్లో పరిశ్రమల ఏర్పాటుకు ఆలస్యమైంది. దీంతో పరిశ్రమల స్థాపన జరుగుతుందా లేదా? అని పలువురు అనుమానాలను వ్యక్తం చేశారు. బల్బుల పరిశ్రమలు కాకుండా ఇతర చిన్న తరహా పరిశ్రమలను ఏర్పాటు చేయించేవిధంగా అధికారులు చర్యలు ప్రారంభించారు. దీంతో ప్రస్తుతం నాలుగు చిన్న తరహా పరిశ్రమల నిర్మాణ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి.



పరిశ్రమ ఏర్పాటుకు ప్రహరీ నిర్మించిన ఓ కంపెనీ యాజమాన్యం

30ఎకరాల స్థలం కేటాయింపు

పారిశ్రామికవాడలో రోడ్లు, నీటి సౌకర్యం, విద్యుత్ సరఫరా, డ్రైనేజీ వసతులను కల్పించారు. కొడకంచి నుంచి ఎల్ఈడీ పార్కు వరకు రోడ్డును ఏర్పాటు చేయాల్సి ఉంది. దీంతో పాటు జిన్నారంలోని సర్వే నంబర్ 1లో పరిశ్రమల ఏర్పాటుకు ప్రభుత్వం 30ఎకరాల స్థలాన్ని కేటాయించింది. దీంతో గ్రామాలకు పారిశ్రామిక ప్రగతి మెదలైంది. రెండేళ్లలో పరిశ్రమలు అందుబాటులోకి వస్తాయని అధికారులు చెబుతున్నారు. రానున్న రోజుల్లో మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా ప్రారంభించేలా ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి, అధికారులు చర్యలు చేపడుతున్నారు.



పారిశ్రామికవాడలో కొనసాగుతున్న పనులు

ఉపాధి కోసం ఎదురుచూపులు

శివానగర్, జిన్నారంలో పరిశ్రమల ఏర్పాటు పూర్తయితే ప్రత్యక్షంగా, పరోక్షంగా వేల మందికి ఉపాధి అవకాశాలు లభించే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. పరిశ్రమల ఏర్పాటుకు సంబంధించి నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసేవిధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని యువత కోరుతోంది.



పారిశ్రామికవాడలో విశాలమైన రోడ్డు

“ యువతకు ఉపాధి లభిస్తుంది



పరిశ్రమల ఏర్పాటుతో సమీపంలోని గ్రామాలు పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతాయి. ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి సహకారంతో కాలుష్య రహిత పరిశ్రమల ఏర్పాటు జరుగుతోంది. దీంతో వేల సంఖ్యలో యువతకు ఉపాధి లభిస్తుంది. మంత్రులు హరీశ్‌రావు, కేటీఆర్‌ల చేతుల మీదుగా మరిన్ని పరిశ్రమల ఏర్పాటుకు శంకుస్థాపనలు చేయించేందుకు ఎమ్మెల్యే కృషి చేస్తున్నారు.

– ప్రభాకర్, జెడ్పీవైస్ చైర్మన్

భక్తిశ్రద్ధలతో విగ్రహాల ప్రతిష్ఠాపన

నారాయణఖేడ్: మండల పరిధిలోని చల్లగిద్ద తండాలో బుధవారం త్రయాహ్నిక జగదాంబ, సేవాలాల్, రాంరావ్ మహారాజ్, నంది, శిఖర, ధ్వజమూర్తి యంత్రస్థిర ప్రతిష్ఠాపన మహోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సంగ్రాం మహారాజ్, బాబుసింగ్ మహారాజ్ ఆధ్యాత్మిక ప్రవచనాలు బోధించారు. కార్యక్రమంలో టీపీసీసీ ఉపాధ్యక్షులు డాక్టర్ సంజీవరెడ్డి, టీపీసీసీ సభ్యులు శ్రీనివాస్, విగ్రాం రామాగౌడ్ పీపుల్స్ వెల్ఫేయిర్ ట్రస్టు చైర్మన్ శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

12 నుంచి విగ్రహాల ప్రతిష్ఠాపన మహోత్సవాలు

కల్హేర్ మండల కేంద్రంలో ఈ నెల 12 నుంచి 14వ తేదీ వరకు సీతారామలక్ష్మణ, హనుమాన్, గణపతి, కుమారస్వామి విగ్రహ, ధ్వజస్తంభ, శిఖర ప్రతిష్ఠ మహోత్సవాలను నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ బాధ్యులు తెలిపారు. బుధవారం ఉత్సవ కమిటీ బాధ్యులతో పాటు సర్పంచ్ లచ్చవ్వబాలయ్య, కల్హేర్, బాచేపల్లి పీఏసీఎస్ చైర్మన్లు వీరోశెట్టి, సంగారెడ్డి తదితరులు నారాయణఖేడ్‌లోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డిని కలిసి మహోత్సవాల్లో పాల్గొనాలని ఆహ్వానపత్రికను అందజేశారు. అనంతరం పెద్దశంకరంపేటలో విగ్రాం రామాగౌడ్ పీపుల్స్ వెల్ఫేయిర్ ట్రస్టు చైర్మన్ శ్రీనివాస్‌గౌడ్‌ను కలిసి ఆహ్వానపత్రికను అందజేశారు.



ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డికి ఆహ్వానపత్రికను అందజేస్తున్న బాధ్యులు

మంత్రి హామీపై మధ్యాహ్న భోజన కార్మికుల హర్షం



మంత్రి హరీశ్‌రావుతో మాట్లాడుతున్న మహిళా కార్మికులు

జహీరాబాద్: మధ్యాహ్న భోజన పథకాన్ని అక్షయ పాత్ర ద్వారా కాకుండా మధ్యాహ్న భోజన కార్మికుల ద్వారానే నిర్వహించేవిధంగా అవకాశం కల్పించాలని ఆదేశించిన మంత్రి హరీశ్‌రావుకు మహిళా కార్మికులు కృతజ్ఞతలు తెలిపారు. బుధవారం మంత్రి హరీష్‌రావును క్యాంపు కార్యాలయంలో కలిసి మధ్యాహ్న భోజన మహిళా కార్మికులు తమ సమస్యలను ఏకరువు పెట్టారు. వంట కార్మికుల స్థానంలో అక్షయ పాత్ర ద్వారా మధ్యాహ్న భోజన పథకం నిర్వహిస్తుండటంతో తాము రోడ్డున పడ్డామని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో తమకు అవకాశం కల్పించి ఉపాధి చూపాలని కోరగా మంత్రి స్పందించి అక్షయపాత్ర ద్వారా కాకుండా మహిళా కార్మికుల ద్వారానే మధ్యాహ్నం భోజన పథకం నిర్వహణ చేపట్టాలని అధికారులను ఆదేశించడంతో మహిళా కార్మికులు సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు నామ రవికిరణ్, యాకూబ్, జహంగీర్, మోతిరాం, అబ్దుల్లా, అక్రమ్‌లు పాల్గొన్నారు.

ఎల్ఓసీ చెక్కు అందజేత

సంగారెడ్డి టౌన్: సదాశివపేట పట్టణానికి చెందిన గిరిజారాణి కుటుంబ సభ్యులకు రూ.2లక్షల ఎల్ఓసీ చెక్కును బుధవారం సంగారెడ్డి కలెక్టరేట్ క్యాంపు కార్యాలయంలో మంత్రి హరీశ్‌రావు అందజేశారు. దీంతో చెక్కు మంజూరుకు కృషి చేసిన చింతా ప్రభాకర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీడీసీ చైర్మన్ కసాల బుచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధితురాలికి అండగా ఉంటాం

పటాన్‌చెరు: అగ్ని ప్రమాదంలో సర్వస్వం కోల్పోయిన చిరు మహిళా వ్యాపారికి బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు గూడెం మధుసూదన్‌రెడ్డి అండగా నిలిచి చేయూత అందించారు. అమీన్‌పూర్ మండల పరిధిలోని పటేల్‌గూడ గ్రామ పరిధిలోని సిద్ధార్థ కాలనీకి చెందిన నాగేశ్వరరావు తన భార్యతో కలిసి ఇంట్లోనే చీరలు, ఫాన్సీ స్టోర్ వ్యాపారం నిర్వహిస్తూ జీవనం కొనసాగిస్తున్నారు. మంగళవారం ప్రమాదవశాత్తు చోటుచేసుకుంది. అగ్ని ప్రమాదంలో సామాగ్రి పూర్తిగా అగ్నికి ఆహుతి అయింది. స్థానిక బీఆర్‌ఎస్ నాయకుల ద్వారా సమాచారం తెలుసుకున్న గూడెం మధుసూదన్‌రెడ్డి మంగళవారం సాయంత్రం బాధితులను పరామర్శించి అధైర్యపడొద్దని, ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి ద్వారా ప్రభుత్వపరంగా పూర్తిస్థాయిలో ఆదుకుంటామని భరోసా కల్పించారు. తక్షణ సాయంగా రూ.లక్ష అందజేశారు. ప్రభుత్వపరంగా మరో 20లక్షల రుణాన్ని అందించేందుకు సహకరిస్తామని హామీనిచ్చారు. అగ్ని ప్రమాదంలో తీవ్ర నష్టానికి గురైన తమను ఆదుకునేందుకు ముందుకు వచ్చిన మధుసూదన్‌రెడ్డికి బాధితులు కృతజ్ఞతలు తెలిపారు.

ఎన్ఎంఆర్ సేవలను విస్తృతం చేస్తాం



ఎన్ఎంఆర్ యువసేన సభ్యులతో నీలం మధు

బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు నీలం మధు

పటాన్‌చెరు టౌన్: ఎన్ఎంఆర్ యువసేన సేవలను విస్తృతం చేస్తామని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు నీలం మధు ముదిరాజ్ అన్నారు. అమీన్‌పూర్ మండల పరిధిలోని బొమ్మనకుంట గ్రామంలో బుధవారం ఎన్ఎంఆర్ యువసేన ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బొమ్మనుకుంట గ్రామపంచాయతీ నాలుగో వార్డుసభ్యులు రాజు తదితరులు నీలం మధు సమక్షంలో ఎన్ఎంఆర్ యువసేనలో చేరారు. అనంతరం నీలం మధు మాట్లాడుతూ ఎన్ఎంఆర్ యువసేన ఆధ్వర్యంలో నియోజకవర్గ వ్యాప్తంగా అనేక సేవా కార్యక్రమాలు చేపడుతూ అన్నివర్గాల ప్రజలకు అండగా నిలుస్తూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్తున్నామని వివరించారు. సీఎం కేసీఆర్, మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు నేతృత్వంలో బీఆర్‌ఎస్ బలోపేతమే లక్ష్యంగా మరింత కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు హైమద్, అజయ్, మల్లేష్, మురళీ, ఆనంద్, గిరి, తిమప్ప, అదిరెడ్డి, నారాయణ, రాము, శంకరయ్య, దేవిప్రసాద్, వెంకటయ్య, గంగయ్య, స్వామి, నరసింహ, మన్నే రాములు, యాదగిరి, బాల్‌రాజ్, యాదగిరి, ఎన్ఎంఆర్ యువసేన సభ్యులు పాల్గొన్నారు.

జాతీయ రహదారిపై విరిగిపడిన చెట్టు

మనూరు(నారాయణఖేడ్): ఈదురు గాలులతో కురిసిన వర్షం కారణంగా మనూరు మండల పరిధిలోని బెల్లాపూర్ మనూరు గ్రామాల మధ్య జాతీయ రహదారిపై వేపచెట్టు బుధవారం సాయంత్రం విరిగిపడింది. దీంతో వాహనదారులకు రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. ప్రధాన రహదారి కావడంతో ట్రాఫిక్ జామ్ కాగా స్థానికులు చెట్టును తొలగించారు. దీంతో వాహనాల ట్రాఫిక్ తొలగిపోయింది.



బెల్లాపూర్ వద్ద జాతీయ రహదారిపై విరిగిపడిన చెట్టు

అందోల్ పెద్ద చెరువు పరిశీలన



పెద్ద చెరువును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే క్రాంతికిరణ్

జోగిపేట(అందోల్): అందోల్ పెద్ద చెరువును ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ బుధవారం సందర్శించారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా గురువారం చేపట్టే చెరువుల పండగ కార్యక్రమంపై స్థానిక ప్రజాప్రతినిధులతో చర్చించారు. పెద్ద చెరువులోకి వస్తున్న సింగూరు ప్రాజెక్టు నీటిని పరిశీలించారు. చెరువుల పండగ కార్యక్రమంలో భాగంగా నిర్వహించే ఏర్పాట్లపై మున్సిపల్ చైర్మన్ మల్లయ్య, వైస్‌చైర్మన్ ప్రవీణ్‌కుమార్‌లు ఎమ్మెల్యేకు వివరించారు. చెరువుల పండుగ కార్యక్రమంపై నాయకులకు, అధికారులకు ఎమ్మెల్యే పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు గాజుల నవీన్‌కుమార్, గోపాల్‌రావు, తుపాకుల సునీల్‌కుమార్, నాయకులు శ్రీధర్, వెంకటేశం, ఖాజాపాష, గాజుల అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ హయాంలోనే చెరువుల పునరుద్ధరణ

ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు: బీఆర్‌ఎస్ హయాంలోనే చెరువులను పునరుద్ధరించినట్లు ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా బుధవారం పట్టణంలోని సాకి చెరువుకట్టపైన నిర్వహించిన సాగునీటి దినోత్సవ కార్యక్రమానికి ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రెడ్డి కాకతీయుల కాలంలో చెరువులను పునరుద్ధరించి పూడికలను తీస్తే మళ్లీ ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన అనంతరం సీఎం కేసీఆర్ మిషన్ కాకతీయ పథకం ప్రవేశపెట్టి చెరువులకు పూర్వవైభవం తీసుకువచ్చారని తెలిపారు. ఒకవైపు సాగునీరు.. మరోవైపు 24 గంటల విద్యుత్ అందిస్తుండటంతో రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందారన్నారు. గ్రామీణ ప్రాంతాలతో పాటు జీహెచ్ఎంసీ, మున్సిపాలిటీల పరిధిలోని చెరువుల అభివృద్ధికి అధిక నిధులు కేటాయిస్తున్నామని వివరించారు. పట్టణంలోని సాకి చెరువు అభివృద్ధికి ఇంకార్ సంస్థ సహకారంతో రూ.5 కోట్ల నిధులు కేటాయించినట్టు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ సుష్మాశ్రీ వేణుగోపాల్‌రెడ్డి, జెడ్పీటీసీలు సుప్రజావెంకట్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, కార్పొరేటర్లు సింధు ఆదర్శ్‌రెడ్డి, పుష్పనగేష్, చెరువుల విభాగం సూపరింటెండెంట్ ఇంజనీర్ ఆనంద్, అధికారులు, నాయకులు, పాల్గొన్నారు.



ఆలయ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

శరవేగంగా అభివృద్ధి పనులను చేపడుతున్నాం

పటాన్‌చెరు: అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని ఆయా ప్రాంతాల్లో అభివృద్ధి పనులను శరవేగంగా చేపడుతున్నామని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి తెలిపారు. అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని 18వ వార్డు శ్రీరామ్‌నగర్ కాలనీలో రూ.60 లక్షల మున్సిపల్ నిధులు, జీవీఆర్ ఎంటర్‌ప్రైజెస్ సంస్థ అందించిన రూ.10 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు బుధవారం ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. అనంతరం చక్రపురి కాలనీలో శివాలయం నిర్మాణానికి భూమిపూజ నిర్వహించారు. అదేవిధంగా పటేల్‌గూడ గ్రామంలో రూ.15 లక్షలతో శ్మశానవాటికకు నిర్మించనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అన్నివర్గాల సంక్షేమమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి, వైస్‌చైర్మన్ నందారం నరసింహగౌడ్, అమీన్‌పూర్ ఎంపీపీ దేవానందం, జెడ్పీటీసీ సుధాకర్‌రెడ్డి, పటేల్‌గూడ సర్పంచ్ నితీశాశ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **ఆలయ నిర్మాణానికి విరాళం**

జిన్నారం(పటాన్‌చెరు): మండల పరిధిలోని ఊట్ల గ్రామంలో నిర్మిస్తున్న అయ్యప్పస్వామి దేవాలయ నిర్మాణానికి సీజీఆర్ ట్రస్టు అధినేత గోవర్ధన్‌రెడ్డి బుధవారం రూ.లక్ష విరాళాన్ని ఆలయ నిర్వాహకులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు గోవర్ధన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ ఆంజనేయులు, మాజీ సర్పంచ్ శివరాజ్ తదితరులు పాల్గొన్నారు.

◆ **ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత**

పటాన్‌చెరు టౌన్: ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత లభిస్తుందని కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని ఇంద్రేశం గ్రామంలోని చౌడేశ్వరి అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపనలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్, సర్పంచ్ దండు నర్సింహులు, ఉపసర్పంచ్ శివకుమార్‌గౌడ్‌ను ఆలయ కమిటీ సభ్యులు సన్మానించారు. కార్యక్రమంలో వార్డుమెంబర్ రాజ్‌కుమార్ గ్రామపెద్దలు పాల్గొన్నారు.

◆ **కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు**

రామచంద్రాపురం(పటాన్‌చెరు): బీహెచ్ఈఎల్ టౌన్‌షిప్‌లోని రుక్మిణి సత్యభామ సహిత మురళీకృష్ణస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా భక్తులు బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు.

◆ **‘నీటి పారుదల రంగంలో సాధించింది శూన్యం’**

రామచంద్రాపురం(పటాన్‌చెరు): నీటిపారుదల రంగంలో ప్రభుత్వం సాధించింది శూన్యమని బీజేపీ సీనియర్ నాయకులు, దుబ్బాక నియోజకవర్గం పాలక్ అంజిరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. బీఆర్‌ఎస్ అధికారంలో వచ్చిన 9ఏళ్ల కాలంలో ప్రజలకు చేసిందేమీలేదని, కమిషన్‌ల కోసమే కాళేశ్వరం ప్రాజెక్టును సృష్టించారని ఆరోపించారు. రాష్ట్రంలో 46,531 చెరువులున్నాయని, వాటిలో సగం చెరువులను కూడా అభివృద్ధి చేయలేదన్నారు.

◆ **లేగదూడలకు నట్టల నివారణ మందులు**



జోగిపేట(అందోల్): తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా అందోల్ మండలం పోసానిపేట గ్రామంలో పశు సంవర్ధకశాఖ ఆధ్వర్యంలో బుధవారం కృత్రిమ గర్భాదారణ ద్వారా జన్మించిన లేగదూడలకు నట్టల నివారణ మందులు తాగించారు. కార్యక్రమంలో గోపాలమిత్ర సూపర్‌వైజర్ అర్జునయ్య, గ్రామపెద్దలు శ్రీనివాస్‌యాదవ్, మన్నె సురేందర్, గోపాలమిత్రలు నాగరాజు కేఆర్ ప్రభు, రైతులు పాల్గొన్నారు.

◆ **నియామకం**

జహీరాబాద్: యువజన కాంగ్రెస్ రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా జహీరాబాద్‌కు చెందిన ముల్గి మల్లికార్జున్ నియమితులయ్యారు. ఈ మేరకు యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివసేనరెడ్డి మంగళవారం నియమకపు ఉత్తర్వులు జారీ చేశారు. తన నియామకానికి కృషి చేసినందుకు మాజీ మంత్రి గీతారెడ్డి, ఎంపీపీ గిరిధర్‌రెడ్డి, యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివసేనరెడ్డిలతో పాటు ఉదయ్‌శంకర్‌పాటిల్, సుభిద్వివేది, ఖలీద్ అహ్మద్, రమేష్ బాబులకు కృతజ్ఞతలు తెలిపారు.

◆ **బస్‌పాస్‌లకు రిజిస్ట్రేషన్ చేసుకోండి**

నారాయణఖేడ్: నూతన విద్యా సంవత్సరం ప్రారంభంలో భాగంగా త్వరలో పాఠశాలలు, కళాశాలలు పుణఃప్రారంభం కానున్నందునా విద్యార్థులకు ఉచిత, రూట్ బస్ పాసులు జారీ చేయనున్నట్లు ఆర్టీసీ డీఎం మల్లేశయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సంబంధిత పాఠశాలలు, కళాశాలల వారు యూజర్ ఐడీ, పాస్‌వర్డ్‌ను తీసుకొని విద్యార్థుల తరగతి, పాఠశాల, కళాశాల వివరాలతో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. పూర్తి వివరాల కోసం పీఆర్వో పాండు 9441071134, అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ ప్రవీణ్‌కుమార్ 9494093486, బస్‌పాస్ విభాగం ఇన్‌చార్జి శివశంకర్, 9676667703, సాయిలు, 9866762123 నెంబర్లలో సంప్రదించాలని సూచించారు.

◆ **చౌటకూరు మండలంలో భారీ వర్షం**

జోగిపేట(అందోల్): చౌటకూరు మండలం పరిధిలోని శివ్వంపేట, వెండికోల్, సుల్తాన్‌పూర్, చక్రియాల ప్రాంతాల్లో బుధవారం ఈదురుగాలులతో కూడిన వర్షం కురవడంతో వాహనదారులు హైవేల వెంట ఉన్న భవనాల వద్దకు పరుగులు తీసి తలదాచుకున్నారు. సరాఫ్‌పల్లి వరకు మాత్రమే వర్షం కురిసింది. జోగిపేట, అందోల్ ప్రాంతంలో కేవలం ఈదురుగాలులు వీయడంతో కొద్దిసేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.

◆ **విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు ప్రారంభం**

పుల్‌కల్(అందోల్): మండల పరిధిలోని పెద్దారెడ్డిపేటలో నిర్మించిన సీతారామాచంద్రస్వామి విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవాలు బుధవారం వైభవంగా ప్రారంభమైయ్యాయి. మూడు రోజుల పాటు నిర్వహించే ఉత్సవాలను మదనానంద సరస్వతిస్వామి అధ్వర్యంలో నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలకు భక్తులు తరలిరావాలన్నారు.

◆ **భక్తిశ్రద్ధలతో ఆలయ వార్షికోత్సవం**

ఝరాసంగం(జహీరాబాద్): మండల పరిధిలోని కుప్పానగర్ గ్రామశివారులోని గుబ్బడి సంగమేశ్వర ఆలయ వార్షికోత్సవ వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ముఖ్య అతిథులుగా బర్దీపూర్ ఆశ్రమ పీఠాధిపతి 108వైరాగ్య శిఖామణి అవధూతగిరి మహారాజ్, ధనసిరి పీఠాధిపతి శివాచార్య మహారాజ్ హాజరయ్యారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సుజాత, ఏపీఎం బాలక్రిష్ణ పాల్గొన్నారు.

◆ **చిన్న చెల్మెడకు తరలిన నాయకులు**



న్యాల్‌కల్(జహీరాబాద్): సాగు నీటి దినోత్సవాన్ని పురస్కరించుకొని మునిపల్లి మండల పరిధిలోని చిన్నచెల్మెడ గ్రామంలో నిర్వహించిన కార్యక్రమానికి మండల పరిధిలోని నాయకులు, ప్రజాప్రతినిధులు, రైతులు తరలివెళ్లారు.

◆ **వర్షంతో చల్లబడిన వాతావరణం**

రాయికోడ్(అందోల్): గత కొన్ని వారాలుగా తీవ్రమైన ఎండలతో ఇబ్బంది పడుతున్న ప్రజలకు బుధవారం కురిసిన వర్షంతో ఉపశమనం లభించింది. అనంతరం వాతావరణంలో చోటుచేసుకున్న మార్పులతో వర్షం కురిసి చల్లబడింది. దీంతో ప్రజలకు ఎండ, వేడిమి నుంచి ఉపశమనం పొందినట్లు అయింది.